
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శనివారం, 05, సెప్టెంబర్, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## జాతీయ ఉత్తమ టీచర్లతో ప్రధాని
# మోదీ ఆత్మీయ భేటీ.



**న్యూఢిల్లీ :** ఉపాధ్యాయ దినోత్సవం సంద ర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసం జరిగిన ఈ ఆత్మీయ కలయికలో ప్రధానమంత్రి ఉపాధ్యాయులతో ఎంతో ఉల్లాసంగా ముచ్చటించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను కొనియాడటంతో పాటు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను ఆయన స్మరించుకున్నారు.నవ్వులు పూయించిన ముచ్చట్లుఈ సమావేశంలో ఉపాధ్యాయులు తమ విద్యాబోధనలోని వినూత్న పద్ధతులను ప్రధానితో పంచుకున్నారు. పిల్లలకు ఇంటర్వ్యూలు చేయడం నేర్పిస్తున్నానని ఒక ఉపాధ్యాయురాలు చెప్పగా.. "అలాగైతే మీ పిల్లలు ఇంట్లో తల్లిదండ్రులను కూడా వంట ఎందుకు చేశారంటూ ప్రశ్నిస్తున్నారా?" అని మోదీ చమత్కరించడంతో హాలులో నవ్వులు విరిశాయి. అలాగే విద్యార్థులకు పబ్లిక్ స్పీకింగ్ నేర్పించే మరో టీచర్‌తో.. "నేను మీ స్టూడెంట్‌ని అనుకుంటే, మంచి వక్తగా ఎదగడానికి నాకు ఎలాంటి చిట్కాలు ఇస్తారు?" అని ప్రధాని అడిగారు. ఇందుకు ఆ టీచర్ కాస్త తడబడుతూనే.. నిరంతర సాధనతో పాటు మోదీ గారి వ్యక్తిత్వ ప్రభావాన్ని చూసి నేర్చుకోవచ్చని చెప్పడంతో వాతావరణం మరింత సందడిగా మారింది.

# నాదీ గవర్నమెంట్ స్కూలే

## - పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులే

- పిల్లల భవిష్యత్తు తరగతి గదిలోని ఉపాధ్యాయులు చేతిలోనే ఉంటుంది
- సాంకేతిక విద్యకు సంబంధించి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది

**హైదరాబాద్ :**తల్లిదండ్రులతో పాటు సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు తరగతి గదిలోని ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుందన్నారు. విద్యాశాఖ జాతీయ సగటులో 17వ స్థానానికి చేరుకుందన్న సీఎం, 51 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని గుర్తు చేశారు. తెలంగాణలో 88 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, ఉపాధ్యాయులపై నమ్మకంతోనే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని తెలిపారు. సాంకేతిక విద్యకు సంబంధించి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. ఈ



మేరకు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొడంగల్ ప్రభుత్వ జూనియర్? కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ వేడుకల్లో మాట్లాడారు.ఉన్నత స్థానాల్లో ఉన్నవారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారే. విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకువస్తున్నాం. నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాను. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేస్తే బాధ కలిగింది. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను నేను పూర్తి చేశాను. టీచర్ల బదిలీల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉన్నాను. 315 జీవో ద్వారా చాలా సమస్యలు పరిష్కరించాం. విద్యాశాఖ కమిషన్ ద్వారా చాలా సమస్యలు పరిష్కరిస్తున్నాం. - సీఎం రేవంత్? రెడ్డిఅంతకుముందు కొడంగల్ నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. తెలంగాణలో ఓట్లను తొలగించి దొంగ దెబ్బ తీయాలనుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారన్న ముఖ్యమంత్రి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను బీజేపీ టార్గెట్ చేసిందన్నారు. గతంలో ఎన్నికల్లో ఓడించేందుకు ఈడీ, సీబీఐ ఉపయోగించేవారన్నారు. కాంగ్రెస్‌ను ఓడించే కుట్రకు బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతు ఇస్తోందన్న రేవంత్ రెడ్డి, అందరూ అప్రమత్తంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

## కేఆర్ఎంబీ ఆదేశాలు
# తెలంగాణకు గొడ్డలిపెట్టు


- ఏపీ నీటి దోపిడీకి రేవంత్ సర్కార్ సహకారం:
- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని కేఆర్ఎంబీ ఆదేశాలు
- తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అన్న కేటీఆర్

**హైదరాబాద్ :**కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని జారీ చేసిన ఆదేశాలు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు కోలుకో లేని గొడ్డలిపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఆర్ఎంబీ నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి, నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. ఎల్‌నినో పేరు చెప్పి కేఆర్ఎంబీ తెలంగాణ హక్కులను కాలరాస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోరుమెదపకపోవడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ నిబంధనల ప్రకారం, ఏ హక్కుతో వెలిగొండ ప్రాజెక్టుకు చట్టవిరుద్ధంగా నీటిని తరలిస్తోందో చెప్పాలని నిలదీసిన కేటీఆర్, ఏపీ నీటి దోపిడీ బోర్డు కళ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.అక్కడ ఏపీ ప్రభుత్వం తన రాష్ట్ర ప్రయోజనాల కోసం దర్జాగా వెలిగొండకు నీటిని తరలిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని రేవంత్ సర్కార్ మాత్రం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులను మూసివేసి ఏపీకి సహకరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన అసమర్థ పాలనతో శ్రీశైలం, నాగార్జున సాగర్



రిజర్వాయర్లను ఏపీకి దారాదత్తం చేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేస్తే నాగార్జున సాగర్ ఎడమ కాలువ, కల్వకుర్తి, జూరాల, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల పథకాల కింద రైతుల పొలాలు ఎండిపోవడమే కాకుండా, బోర్ల కింద వ్యవసాయం చేసే రైతులకు కరెంట్ అందక తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎన్యూమరేషన్ తరహాలోనే గందరగోళంగా
# నోటీసుల ప్రక్రియ



**హైదరాబాద్ :**ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ గందరగోళంగా సాగుతోంది. ఎన్యూమరేషన్ దశలో చుక్కలు చూపించగా, ఇప్పుడు నోటీసుల ప్రక్రియ కూడా అదేవిధంగా జరుగుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, అవగాహన లోపం అడుగడుగునా కనిపిస్తోంది. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు భారీగా వస్తుండగా నోటీసులు, హియరింగ్ మందకొడిగా సాగుతోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిన డాక్యుమెంట్లకు భిన్నంగా బీఎల్వోలు మరికొన్ని కూడా తీసుకొని అప్‌లోడ్ చేస్తున్నారు. ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ కోసం ఇవాళ, రేపు ప్రత్యేక శిబిరాలు నిర్వహించ నున్నారు.ఇళ్లకు వెళ్లకుండానే షిఫ్ట్ కేటగిరీలోకి! : రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అయోమయంగా జరుగుతోంది. ఓటు ఉంటుందా? పోతుందా? అనే ఆందోళనలు కలిగించేలా కొనసాగుతోంది. ఎస్ఐఆర్‌లో భాగంగా జులై 25 నుంచి ఆగస్టు 10 వరకు జరిగిన ఎన్యూమరేషన్ ప్రక్రియ గందరగోళంగానే జరిగింది. ఎన్యూమరేషన్ ఫారాలు ఇంటింటికీ ఇవ్వాలని ఈసీ చెప్పినప్పటికీ పలు ప్రాంతాల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపించింది. ఇళ్ల వద్దకు వెళ్లకుండా ఓటరు ఆ అడ్రస్ నుంచి షిఫ్ట్ అయ్యారని నమోదు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్యూమరేషన్ దశలోనే 73.39 లక్షల ఓట్లు పోయాయి.

## తెలంగాణ ప్రజలపై
# మరో భారం

**హైదరాబాద్ :**రాష్ట్రంలో ఆటో ఛార్జీలను పెంచాలని అధికారుల కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రతిపాదిత రేట్ల ప్రకారం మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా నూ, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14గానూ నిర్ణయించింది. అలాగే నిమిషానికి 75 పైసల వెయిటింగ్ ఛార్జీ, రాత్రివేళ ప్రయాణానికి సాధారణ ఛార్జీపై 50 శాతం అదనపు ఛార్జీ (సర్ ఛార్జ్)ని విధించాలని కమిటీ సూచించింది. ఈ సిఫార్సులతో కూడిన నివేదికను రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి ఇటీవల ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన తర్వాత ఛార్జీల పెంపునకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ కానున్నాయి.ఛార్జీల సవరణ కమిటీ ఏం చెప్పిందంటే? : తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) 14 డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 7 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆగస్టు 23న జరిగిన సమావేశంలో 15 రోజుల్లోగా ప్రతిపాదనలు సమర్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు సమ్మె పిలుపును ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ ట్రాన్స్?పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి,



ఎంవీఐ శ్రీనివాస్, ఏఎం?వీఐలతో కూడిన బృందం తమ నివేదికను సమర్పించే ముందు కేరళ, దిల్లీ, కర్ణాటక (బెంగళూరు), మహారాష్ట్ర (ముంబయి)ల్లోని ఆటో ఛార్జీల విధానాలను అధ్యయనం చేసింది.12 ఏళ్లుగా ఛార్జీలు పెంచలేదు : ఇంధన ధరలు, బీమా, ఇతర నిర్వహణ ఖర్చుల వంటి వ్యయాల ఆధారంగానే ఛార్జీల పెంపు సిఫార్సు చేసినట్లు నివేదికలో కమిటీ పేర్కొంది. వాహన ధర రూ.2.55 లక్షలు, బ్యాంక్ రుణ సదుపాయం 70 శాతం, డ్రైవర్ నెలవారీ జీతం రూ.25 వేలు సగటున రోజువారీ ప్రయాణ దూరం 163.8 కి.మీ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.

## అది విద్యా వ్యవస్థా లేక
# కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?

- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోతపై రేవంత్‌ను నిలదీసిన కవిత
- ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం
- స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత

**హైదరాబాద్:**
ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం



రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు.ప్రభుత్వ భూముల్లో నడిచే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా సర్కార్ మౌనంగా ఉండటం కార్పొరేట్ విద్యా వ్యాపారులకు బాసటగా నిలవడమేనని కవిత ఆరోపించారు. 1994 నాటి జీవో ప్రకారం వార్షిక ఫీజుల పెంపు 5 శాతానికి మించకూడదన్న స్పష్టమైన నిబంధన ఉన్నా దానిని పక్కనబెట్టి, విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లోనే తక్షణమే పాఠశాల ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో
# ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### ఉపాధ్యాయులకు చంద్రబాబు శుభాకాంక్షలు.. సర్వేపల్లి జీవితం ఆదర్శనీయం

**అమరావతి:**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి, మహోన్నత విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని, ఆయన స్మృత్యర్థం సోషల్ మీడియా వేదికగా ముఖ్యమంత్రి ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు.భావి భారత పౌరులను తీర్చిదిద్దుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. సమాజ నిర్మాణంలోనూ, విద్యా రంగంలోనూ గురువుల పాత్ర ఎంతో అమూల్యమైనదని ఆయన కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అత్యంత సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన ఆయన, తన ఆదర్శవంతమైన



జీవనశైలితో దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి బాధ్యతలను చేపట్టారని పేర్కొన్నారు. సర్వేపల్లి ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని.. ఆయన చూపిన మార్గాన్ని, పాటించిన విలువలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# గురువే సమాజానికి దిక్సూచి... దేశ భవిష్యత్తుకు రూపశిల్పి!

- కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా.. 23 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం





**హసన్‌పర్తి, రీపోటర్ ప్రణయ్ గొర్రె,**
"గురువును గౌరవించడం అంటే జ్ఞానాన్ని గౌరవించడమే.. గురువును సన్మానించడం అంటే భవిష్యత్తును సన్మానించడమే" అని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోక్క కుమార్ అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 23 మంది ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బోక్క కుమార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందన్నారు. "మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ" అనే గొప్ప సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత భారతీయ సనాతన సంస్కృతికే దక్కుతుందన్నారు. గురువు ఒక వ్యక్తి కాదు.. ఒక శక్తి. గురువు ఒక ఉద్యోగం కాదు.. ఒక యుగనిర్మాణం అని పేర్కొన్నారు. తల్లి జన్మనిస్తే, తండ్రి నడక నేర్పిస్తారని, గురువు మాత్రం జీవితంలో ఎలా నడవాలో నేర్పిస్తారని అన్నారు. గురువు చేతిలోని చాక్ ముక్క వేలాది జీవితాల భవిష్యత్తును రాస్తుందని, గురువు చెప్పే ఒక్క మంచి మాట విద్యార్థి జీవితానికే దిశను మార్చగలదని తెలిపారు. వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, నాయకులు ఇలా దేశానికి అవసరమైన ప్రతి రంగంలోని నిపుణులను తీర్చిదిద్దేది గురువులేనని అన్నారు. గురువుల గౌరవం తగ్గడం ఆందోళనకరం. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత పిల్లల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ గురువులకు జీవితాంతం కృతజ్ఞతతో ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ప్రభావం పెరగడంతో ఉపాధ్యాయుల పట్ల గౌరవం తగ్గిపోతుండటం ఆందోళనకరమన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న పరిస్థితులు సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురువులను గౌరవించే సమాజమే అభివృద్ధి చెందుతుందని అన్నారు. 23 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానంఅనంతరం తమ సేవలను స్మరించుకుంటూ 23 మంది ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గురువుల సేవలను కొనియాడుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిట్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, వాకర్స్, సభ్యులు పాల్గొన్నారు

# అక్రమ సెల్లార్ సీజ్.. టౌన్ ప్లానింగ్ అధికారుల కొరడా

-- రాజేశ్వరి--హుడా లేఔట్‌లో టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు





**అమీన్పూర్, సెప్టెంబర్ 5 (ప్రజావాణి):** అమీన్పూర్ డివిజన్ పరిధిలోని రాజేశ్వరి--హుడా లేఔట్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సెల్లార్‌పై అమీన్పూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించి సెల్లార్‌ను సీజ్ చేశారు.
అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై తనిఖీలు, చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# కొండాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటి ఎన్నిక

- అధ్యక్షులుగా మంద రాకేష్, కార్యదర్శిగా హరీష్
- దూలిమిట్ట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నల్ల రాజేష్,

**మద్దూరు సెప్టెంబర్ 5, ప్రజా వాణి,**
పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సామాజిక పరివర్తకులు మందకృష్ణ మాదిగ మరియు సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ మాదిగ, జిల్లా కన్వీనర్ ముక్కపల్లి రాజు మాదిగ కో ఇన్చార్జ్ మల్లిగారి యాదగిరి మాదిగ ఆదేశాల మేరకు శనివారం సిద్దిపేట జిల్లా దూలిమిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నుకోవడ ం జరిగింది . ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల రాజేష్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో కులపరమైనటువంటి మతపరమైన వంటి వివక్షలు తొలగిపోయేంతవరకు దళితుల మీద దాడులు ఆగిపోయేం తవరకు ఉద్యమం నిరంతరాయంగా కొనసాగుతుందని నీ ఉద్యమానికి యువత నాయకత్వం వహించాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ దూలిమిట్ట అధికార ప్రతినిధి గుండె రాజు, బెక్కల్ గ్రామ శాఖ ఇన్చార్జ్ ఎర్ర కృష్ణయ్య మాదిగ మరియు కొండాపూర్ కుల సంఘ నాయకులు పెద్దలు యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా



కమిటీనీ ప్రకటించారు.
అధ్యక్షులుగా మంద రాకేష్ మాదిగ,
ఉపాధ్యక్షులుగా మంద ప్రవీణ్ మాదిగ,
అధికార ప్రతినిధిగా మామిడాల సుధాకర్ మాదిగ,
కార్యదర్శిగా మంద హరీష్ మాదిగ,
సంయుక్త కార్యదర్శిగా కొయ్యడ రాజేశం మాదిగ,
కోశాధికారిగా బాకీ రమేష్ మాదిగ,
ప్రచార కార్యదర్శిగా బోడిక కళ్యాణ్ మాదిగ
సలహాదారులుగా ఏనగందుల యాదగిరి, లింగాల సంపత్, రాజు, బాకీ మొగిలిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**
**యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శానగొండ శరత్‌కుమార్**



**బెజ్జంకి, సెప్టెంబర్ 5 (ప్రజావాణి)**
సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గౌరవనీయ ఉపాధ్యాయులను యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శానగొండ శరత్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా క్రమశిక్షణ, విలువలు, నైతికతను నేర్పుతూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుడు వందలాది మంచి భవిష్యత్తులను తీర్చిదిద్దగలడని అన్నారు. ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కత్తి రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కర్రావుల సందీప్, చీలాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అమరాజు నవీన్, గుండారం గ్రామ శాఖ అధ్యక్షులు అమరాజు ప్రశాంత్, పరకాల పరశురాములు, రాగటి రవి, మహేందర్, నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని జాగృతం చేస్తూ విశేష సేవలు

**ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దుర్గం సాయిలుబీర్కూర్:**
సమాజంలో విజ్ఞానాన్ని, అక్షర చైతన్యాన్ని రగిలించే గురువుల లాగే.. సమాజాన్ని జాగృతం చేస్తూ తమ విధినిర్వహణలో సీనియర్ జర్నలిస్టు కొప్పుల గంగాధర్ విశేష సేవలు అందించడం అభినందనీయమని కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దుర్గం సాయిలు పేర్కొన్నారు. గురు దినోత్సవంను పురస్కరించుకుని సీనియర్ జర్నలిస్ట్ కొప్పుల గంగాధర్ ను సన్మానించుకోవడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ జర్నలిజం రంగంలో ఎందరికో మార్గదర్శిగా నిలిచి, పాత్రికేయ రంగంలో దశాబ్దాలుగా సేవలు అందించిన సీనియర్ జర్నలిస్టు కొప్పుల గంగాధర్ను శనివారం బీర్కూర్ మండల ప్రెస్ క్లబ్ తరపున సన్మానించామన్నారు. సీనియర్ జర్నలిస్టులను తక్కువ చూపుతో చూడకుండా, గతంలో వారు అందించిన సమాజ సేవ లను గుర్తిస్తూ.., వారిని గౌరవించుకోవడం నేటితరం జర్నలిస్టుట బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా కొప్పుల గంగాధర్ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దుర్గం సాయిలు, ప్రధాన కార్యదర్శి విఠల్, కోశాధికారి సునీల్, జర్నలిస్టులు శ్రీనివాస్, బాలకృష్ణ, హనుమాన్లు, నగేష్, ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# నడిరోడ్డుపై ద్విచక్రవాహనంతో యువకుడి స్టంట్లు.

**యువకుడిని పట్టుకొని స్టేషన్ కి తరలించిన ఎస్సై ప్రవీణ్ కుమార్.**




**హుజూర్నగర్ సెప్టెంబర్ 5 (ప్రజావాణి)**
సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండల కేంద్రంలోని జాన్‌పాడు, మట్టపల్లి రోడ్డుకు వెళ్లే ప్రధాన చౌరస్తాలో పర్వతం గోపీచంద్ (19) తండ్రి నాగరాజు అనే యువకుడు తన మామ నాగేశ్వరరావు తండ్రి పెద్ద సైదులు ద్విచక్ర వాహనంపై అత్యంత ప్రమాదకరంగా వీలింగ్‌లు చేస్తూ, ఒంటి చక్రం పై బైక్ నడుపుతూ అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. గతంలో కూడా ఇలాగే మఠంపల్లి మండల కేంద్రంలోని జాన్‌పాడు, మట్టపల్లి రోడ్డుకు వెళ్లే ప్రధాన చౌరస్తాలో ఈ గోపీచంద్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై అత్యంత ప్రమాదకరంగా వీలింగ్‌లు చేస్తూ, ఒంటి చక్రం పై బైక్ నడుపుతూ అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. మెయిన్ సెంటర్‌లోనే అధిక వేగంతో బైక్ పై విన్యాసాలు చేయడంతో అక్కడ ఉన్న ప్రజలు, ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి ప్రాణాంతక స్టంట్లు చేయడం అప్పట్లో తీవ్ర ఆందోళన కలిగించిందని స్థానికులు తెలిపారు. ఒక్క క్షణం అదుపు తప్పినా అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని, రోడ్డుపై నడిచే పాదచారులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలకు ఇలాంటి చర్యలు ముప్పుగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం సరదా కోసం చేస్తున్న ఈ విన్యాసాలు పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర స్టంట్లు చేసే యువకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలు వాహనాలను ఎలా నడుపుతున్నారో పర్యవేక్షించి బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. గతంలో ఈ పర్వతం గోపీచంద్ ని పట్టుకోవాలని మఠంపల్లి పోలీసులు ప్రయత్నించినా దొరకకుండా పారిపోయాడు. మళ్ళీ అదే బైక్ మీద మఠంపల్లి సెంటర్, జానపాడు రోడ్డులో ప్రమాదకర స్టశేట్లు చేస్తూ మఠంపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్ కు చిక్కాడు. వెంటనే స్పందించిన ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆ యువకుడిని, ద్విచక్ర వాహనాన్ని మఠంపల్లి స్టేషన్ కి తరలించి అతనిపై కేసు నమోదు చేశారు. ఇటువంటి ప్రమాదకరమైన బైక్ స్టంట్ లు చేసే ఆ యువకుడుని పట్టుకోవటంతో మఠంపల్లి ఎస్సై మరియు సిబ్బంది పై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ సిఐ చరమందరాజు, మఠంపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజానికి ఉత్తమ పౌరులను అందించే ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు: బి.ఆర్.స్ నేత మొలుగు ఆనంద్ రావు

**కూకట్పల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులుకు ఘన సన్మానం**

**కూకట్పల్లి విలేజ్ : ( ప్రజావాణి) సెప్టెంబర్ 5 ప్రతినిధి మునిపల్లి నరేష్**
సీతారామచంద్ర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ మరియు కూకట్ పల్లి డివిజన్ బి.ఆర్.స్ పార్టీ సీనియర్ నాయకులు మొలుగు ఆనంద్ రావు ఎమ్మెల్యే కృష్ణారావుతో కలసి కూకట్ పల్లి లోని జిల్లా ప్రాథమిక పాఠశాలలో లోని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆనంద్ రావు మాట్లాడుతు ఈ పాఠశాల నుంచే ఎంతో మంది విద్యార్థులు చదివి నేడు గొప్ప గొప్ప స్ధయిలో ఉన్నారని అందుకు కారణం ఉపాధ్యాయులేనాని అన్నారు, మనకు విద్య బుద్దులు నేర్పిన గురువులను మనం ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలని విద్యార్థులతో




అని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేసి విద్యార్థిని విద్యార్థులకు అల్పాహారని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొ



టర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు మరియు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **RAYINIPATLA KUMARASWAMY**, Printed at **RAMANI WEB OFFSET PRINTERS**, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : **RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS**, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. **RNI NO:TGTEL/25/A5443** Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com